
-కొంపల్లి ఈశ్వర్






**సాయంత్రంవేళ... జాజులు కోద్దామని పెరట్లోకి వెళ్ళిన ప్రియకి... పక్క పోర్షనులోంచి ఏవో కొత్త గొంతులు వినిపించి, తలెత్తి పైకి చూసింది.**

చాలా రోజుల నుంచి ఖాళీగా వున్న ఆ ఇంట్లోకి కొత్తగా ఎవరో అద్దెకి దిగారు. ప్రియ ఇంటికీ, ఆ ఇంటికీ మధ్య గోడ ఒక్కటే అడ్డు. ఆ ఇంటి వాళ్ళు... కింద నివాసం ఉంటూ, పైన విడిగా నిర్మించిన ఒక పెద్ద గదిని అద్దెకి ఇవ్వడం జరుగుతోంది. ఆ గది కిటికీ ప్రియ పెరడు వైపు ఉంది కాబట్టి... ఆ కిటికీ తలుపులు తెరిస్తే... లోపల ఉన్న మనుషులు స్పష్టంగా కనిపిస్తారు.

గదిలో నుంచి ఆవిడ విసురుగా బాల్కనీలోకి వచ్చింది. వెనకాలే అతనూ వచ్చాడు. భార్యాభర్తలే! ఆ ఇంటివాళ్ళు... కేవలం పిల్లాజెల్లా గొడవలు లేని జంటలకి మాత్రమే ఆ గది అద్దెకివ్వడం... మొదటి నుండీ ప్రియ గమనిస్తూనే ఉంది.

ఆ గదిలో చేరిన ఇద్దరూ... చాలా మామూలు మధ్యతరగతికి చెందినవారే అని తెలిసిపోతోంది.

'సుమా... నా మాట విను... ఇక్కడ కూడా అదే అధ్యాయం రిపీట్ కానివ్వొద్దు ప్లీజ్...' అతను మెల్లిగా అంటున్నానని అనుకుంటూ అన్న మాటలు... ఆ ప్రశాంత వాతావరణంలో... ప్రియకు స్పష్టంగానే వినిపించాయి.

'అదే నేనూ చెప్పేది... మనం చాలా దూరంగా... ఆ పాత వాసనలకీ, జ్ఞాపకాలకీ దూరంగా... ఇక్కడ ఈ పరిచయం లేని కాలనీలోకి వచ్చి చేరడం మన అదృష్టం. మీరు దాన్ని పూర్తిగా మరచిపోయేందుకు ఇదే మంచి అవకాశం. కలలో కూడా దాని సంగతి ఎత్తొద్దు. నా అందచందాలకీ, నాలో వున్న ఆకర్షణకీ ముగ్ధులై నన్ను కట్టుకున్నారని సంతోషపడుతూనే... ఆ ప్రియురాలి నెందుకు మరచిపోరో నా కర్థంకాదు...' ఆవిడ పళ్ళు బిగించి... శబ్దం ఎక్కువ రాకుండానే... భర్తని అనవలసిన... అనదల్చుకున్న మాటలన్నీ అనేస్తోందని అర్థమైంది ప్రియకి.

ప్రియ ఇల్లు నిశ్శబ్దంగా ఉండటం, అలికిడి ఎక్కువగా లేకపోవడంతో ఆ ఆలూమగలూ... ఏ బిడియం లేకుండా... కొత్తింట్లో కూడా ధైర్యంగా తగువులాడుకుంటున్నారనుకుంది ప్రియ.

ముందు గదిలో ప్రియ తల్లి... కుట్టుమిషనుపై ఎవరిదో జాకెట్టు కుట్టే పనిలో ఉంది. తండ్రి ఆఫీసు నుంచి రాలేదు. తమ్ముడు ట్యూషన్ కెళ్ళాడు.

ప్రియ ఇంట్లో మనుషులున్నా లేనట్టే ఉంటుందంటారు అందరూ. నిజమే! వాళ్ళు మొదటి నుంచీ... ఒక క్రమశిక్షణగల జీవితాన్నే గడుపుతూ వస్తున్నారు. బంధువుల రాకపోకలు కూడా అంతగా వుండవు. ఇతరుల సంగతి తమకు పట్టనట్టే ఉంటారు.

పెరట్లో దట్టంగా పెరిగిన జాజిమల్లె... గోడపై బాగా విస్తరించుకొని... వందలాది పూలతో అందంగా ఉంది.

ఇంకా... ఎత్తుగా పెరిగిన కరివేపాకు చెట్టు. కర్టెన్ ప్లాంట్. కొన్ని క్రోటన్స్, కనకాంబరం, గులాబీ మొక్కలు... కొత్తగా నాటిన కొబ్బరి మొక్క... ఈ చిన్నారి తోట మధ్య... ఆ మసక వెలుగులో ప్రియని... పైన వున్న ఆ దంపతులు గమనించకపోవడం సహజమే.

ఏవో వ్యక్తిగతమైన సమస్యలు... సంసారంలోని దైనందిన అభిప్రాయ భేదాలు... సర్దుకుపోవడంలో అడ్డొచ్చే భేషజాలు, 'ఇగో'లు... ఇవన్నీ ఇంటింటా వుండే విషయాలే.

అయితే ఒక ఇంటిలోని సంఘటనలెంత బాధ కలిగించేవైనా... పక్కింటి వాళ్ళకి వాటిని వినడంలోనూ, చూడటంలోనూ చిత్రమైన ఆసక్తి ఏదో ఉంటుంది. వివేకం, విజ్ఞానం, సభ్యతా సంస్కారం... ఇవన్నీ ఆ కాసేపూ గుర్తుకురావు.

దినకర్ అతని పేరు. గవర్నమెంట్ జాబ్ ఇంకా రాలేదు కానీ ప్రస్తుతం ఏదో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సుమ. ప్రైవేట్ స్కూల్‌లో టీచర్. పల్లెలో కాస్త భూమి ఉంది. అత్తామామలు అక్కడే వుండి చూసుకుంటారు. ఇంతకన్న విశేషాలేవీ లేవు... ప్రియ తల్లికి తెలిసినంతవరకు. జాకెట్టు తీసుకుని పోతూ ఆ ఇంటావిడ చెప్పింది ఆ విషయాలన్నీ.

రెండు రోజులు పోయాక-

రాత్రులు... ఎప్పుడో చటుక్కున మెలకువ వచ్చేది ప్రియకు. తను పడుకునే గదికి... పైన వాళ్ళుండే గది చాలా దగ్గర కావడంతో... తరచూ వాళ్ళు ఏదో విషయమై ఘర్షణ పడుతున్నట్టనిపించి... పెరటి గోడకున్న కిటికీలోంచి... అక్కడ చీకట్లో నిలబడి... విషయం వినడానికి ప్రయత్నించసాగింది. ఎవరైనా బాధపడుతుంటే... ఆ బాధకి కారణం తెలుసుకుని... పరిష్కారంలో తనకి చేతనైన సాయం చేయాలనేది ఆమె కోరిక.

'మీరు దాన్ని విడిచి వుండలేరు. నాకు తెలుసు. మిమ్మల్ని నావైపు తిప్పి అట్టే పెట్టుకుంటాననే ఆశ అడియాసే అవుతోంది. నా కోరికలు కల్లలై పోయాయి. పైపైని మీ పోకడలని, నోట్లో నాలుక లేనట్టు మీరు ప్రదర్శించే మంచితనాన్నీ, మీ రంగునీ, ఆ చదువునీ చూసి మా వాళ్ళు మోసపోయారు. ఈ వ్యవహారమొకటి వుందని తెలిస్తే... చచ్చినా నా గొంతుకోసే ప్రయత్నం చేసేవారు కాదు' ఆమె ఏడుస్తోంది మెల్లగా.

'సుమా... ఐ లవ్‌యూ! అనవసరంగా నా మూడ్ పాడుచేయకు. నాకు నువ్వు కావాలి. నువ్వు లేని జీవితం వేస్టు కాదా నాకు?' అతను బతిమాలుతున్న ధోరణిలో.

'నేను కావాలి... అది కావాలి! కుక్కతోక వంకరే కదా! దానికీ మీకు ఎలా కలిసిందో గానీ... మిమ్మల్ని బానిసని చేసుకుంది ఆ పిశాచి! ఏముంది దానిలో...! అందమైన పెళ్ళాం వుండగా మీకిదేం పాడుబుద్ధండీ! బలహీనత... అవును మగాడి స్వేచ్ఛను ప్రదర్శించడానికి ఇలాంటిదొక వినోదం వుండొద్దూ! పైకి మాత్రం శ్రీరామచంద్రుడిలా కనిపిస్తారు. రాతిరవుతోందంటే... నాకంటే ముందు అదే మీ మదిలో మెదిలేది'

'అబ్బా... ఎందుకే ఇలా నన్ను నరుక్కు తింటావు?! ఈ ఒక్క చిన్న విషయం... చూసీ చూడనట్టుండలేవా! అర్థం చేసుకోరాదూ! నువ్వు నా జీవితంలోకి వచ్చిందెప్పుడు? మొన్నీ మధ్యన. కానీ ఆ విషయం ఎప్పటి నుంచి ఉంది? హృదయంలో వేదనలు పెల్లుబికినప్పుడు, అవమానాలు కొరడాల్లా తాకి... మృదువైన నా మనస్సు గాయపడినప్పుడు... తన సాంగత్యంలో సేదతీరాను. తన కౌగిలిలో ఓదార్పు పొందాను. తనని అంత సులభంగా ఎలా వదలగలను చెప్పు....'

'ఇంతకీ మీరనేదేమిటి? దాన్ని వదలనంటారు! మరిక నేనెందుకు? దానితోనే ఊరేగండి'

'అహ అది కాదులే గానీ... నేన్నీకు ఏం కష్టం కలిగిస్తున్నాను చెప్పు... అన్ని అవసరాలకీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాను. నువ్వు ఉద్యోగం చేస్తానంటే అడ్డురాలేదు. నీకు తగినంత స్వేచ్ఛ ఇచ్చాను.'

'స్వేచ్ఛ ఇచ్చారని నేనూ మీ దారిలోనే ప్రయాణిస్తే ఏం జరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి.'

'ఇలాంటివి ఆడాళ్ళకి అచ్చిరావు కదా! అయినా... నేనేమైనా పేకాటకెళ్ళి ఇల్లు గుల్ల చేస్తున్నానా? రెడ్‌లైట్ ఏరియాకెళ్ళి ఎయిడ్స్ తెచ్చుకుంటున్నానా? జస్ట్... ఒక పాత పరిచయం, స్నేహం, అనుబంధం! ఓల్డ్ ఈజ్ గోల్డ్. త్యాగాలకు మారుపేరైన స్త్రీలు... ఇలాంటి చిన్న విషయాలని పట్టించుకోకూడదు'

'అంత విశాల హృదయం నాకు లేదు కానీ... నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. గొంతెమ్మ కోరికలతో కాపురం కూల్చుకునేంత అవివేకిని కాను. వేరే ఏ కష్టమైనా భరిస్తాను... కానీ ఈ వ్యవహారాన్ని భరించలేను. దాన్ని ఇక్కడక్కూడా తెచ్చి, ఇంటిని భ్రష్టు పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదు. జనాలకి తెలిస్తే... అంతా నన్నే అంటారు... మొగుడు పక్కదార్లు పడుతుంటే... పట్టనట్టు కూర్చున్న పెళ్ళాంగా చూస్తారు. అందుకే... చివరిసారిగా చెబుతున్నాను - మరోసారి దాని సంగతి కాదు కదా... కనీసం దాని పేరు కూడా వినిపించకూడదు... లేదంటే... లేదంటే... కథ మరో మలుపు తిరగడం ఖాయం!'

'ఛీ... నన్ను సుఖపడనీయవే నువ్వు! నా హృదయ ఘోష నీకర్థంకాదు. పో! నేనూ చూస్తాను ఏం జరుగుతుందో...'

తలుపు తీస్తున్న చప్పుడు... విసురుగా!

'దాని దగ్గరకే వెళ్తున్నారా వెళ్ళండి... ఏదెలా జరుగుతుందో జరగొద్దూ'

తలుపు మూసిన చప్పుడు... మెట్ల మీద అడుగుల సవ్వడి.

ఆలోచిస్తూ గదిలోకెళ్ళి పడుకుంది ప్రియ.

దినకర్‌కి మరో అమ్మాయితో వ్యవహారం నడుస్తున్నదని తెలిసీ సుమ అతన్ని ఎలా క్షమించగలుగుతుంది? మగవాడు ఎంతకైనా తెగిస్తాడు. తన భాగోతం... భార్యకి తెలిసిపోయిందనే భయం, విచారం, సిగ్గు కూడా లేకుండా... పైగా 'దాని దగ్గరకే వెళతాను. దానితోనే



గొంతెమ్మ కోరికలతో కాపురం కూల్చుకునేంత అవివేకిని కాను. వేరే ఏ కష్టమైనా భరిస్తాను... కానీ ఈ వ్యవహారాన్ని భరించలేను. దాన్ని ఇక్కడక్కూడా తెచ్చి, ఇంటిని భ్రష్టు పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదు. జనాలకి తెలిస్తే... అంతా నన్నే అంటారు... అందుకే... చివరిసారిగా చెబుతున్నాను - మరోసారి దాని సంగతి కాదు కదా... కనీసం దాని పేరు కూడా వినిపించకూడదు... లేదంటే... లేదంటే... కథ మరో మలుపు తిరగడం ఖాయం!'

వుంటాను' అంటున్నాడే! పాపం సుమ! అదెవత్తో... దాని దగ్గరికే వెళ్ళి... నిలదీసి... తన భర్త జోలికి రావద్దని చెప్పే ధైర్యం లేని సుమ... ఈ పరిస్థితినెలా ఎదుర్కొంటుందో! చివరికి ఆమె కథ ఎంతటి విషాదభరితమవుతుందో...

ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది ప్రియ.

మరునాడు ఉదయం... దుర్వార్త ఒకటి చెవిన పడిందామెకు.

తమ్ముడు చెబుతున్నాడు. దినకర్‌కి కాలు విరిగిందట.

ప్రియ తమ్ముడిని పట్టుకుని వివరాలడిగింది ఆసక్తిగా.

రాత్రి గేటు తీసి మెట్లెక్కుతూ చీకట్లో జారిపడ్డాడనీ, అతడిని ఆటోలో దించిన అతని మిత్రుడే, డ్రైవర్ సహాయంతో అతడిని ఆసుపత్రికి తీసుకెళ్ళాడనీ, అర్ధరాత్రి పక్క వాళ్ళని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక సుమ... ఇంటివాళ్ళకి ఈ విషయం చెప్పలేదనీ, ఉదయం ఆసుపత్రి నుంచి ఫోన్ చేసిందనీ చెప్పాడు అతను.

ప్రియ పరిపరివిధాలుగా ఆలోచించసాగింది. ఏం జరిగిందో ఆమెకి అర్థం కాకపోయినా... దినకర్ ప్రేయసిపై మాత్రం చెప్పరాని కోపం కలిగింది.

వారం దాకా సుమ బిజీగానే ఉంది. ఆమె ఇంటికి ఎవరో ఒకరు వస్తూండటం, ఆసుపత్రికి వెళ్తూండటంతోనే సరిపోయినట్టుంది.

దినకర్‌ని ఇంటికి తీసుకుని వచ్చారు.

ఆ రోజు రాత్రి... అనుకోకుండా మెలకువ రాగా... చప్పున లేచి కూర్చుంది ప్రియ. గది నుంచి పెరటి వేపుకున్న కిటికీ దగ్గరకొచ్చి నిల్చుంది. అక్కడ నుంచి... సుమ వాళ్ళ గదిలోని వెలుతురు... ఆ కిటికీ నుండి సన్నగా బయటకి ప్రసరిస్తుంటే... ప్రియ గలగలా నవ్వడం చూసింది.

'జరిగింది మంచైనా చెడైనా... మేలు మాత్రం జరిగిందిలే... నెలరోజుల దాకా దాని ఊసైనా ఎత్త డానికి వీలులేదు కదా!' అంటోంది సుమ భర్తతో. అతడు ఉడుక్కోకుండా... సుమని అటువైపు లాగి అంటున్నాడు...

'అవును సుమా! నువ్వు చెప్పినదానిలో నిజం ఉంది. నీ ప్రేమ అండగా వుంది కాబట్టి నేను బ్రతికిపోయాను. కంటికి రెప్పలా కాపాడుకునే నువ్వుండగా... నాకు దానితో పనేముంది! ఇక నేను ఆ వెధవ తాగుడు జోలికి వెళ్ళనుగాక వెళ్ళనని మన ప్రేమసాక్షిగా చెబుతున్నాను. దాని కృత్రిమమైన మత్తుకంటే... చిరకాలం నన్ను బతికించే నీ అనురాగపు మత్తే ఎక్కువ కాదా!'

వింటున్న ప్రియ అప్రయత్నంగా చేతిని నోటికడ్డం పెట్టుకుని ఆశ్చర్యపోతూ అనుకుంది...

'అదంటే ఇదా! నిజమే సుమా! ప్రియురాలి మత్తు ఏదో ఒకనాడు దిగిపోవచ్చు. కానీ తననీ, కాపురాన్నీ చివరి దాకా పీడించే ఈ విషకన్య మాత్రం ఏ స్త్రీకీ సవతి కాకూడదు'.

★

